సాక్షి
కామారెడ్డి
గురువారం । 31 । ఆగస్టు । 2023



ఇంక్రిమెంట్ సాధన కోసం..

నోషనల్ ఇంక్రిమెంట్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి కమలాకర్‌రావు పేర్కొన్నారు.

- 9లో ▸



సిలిండర్ ధర తగ్గింపుపై..

కేంద్రం వంట గ్యాస్ సిలిండర్ ధర తగ్గించడంతో బుధవారం జిల్లాలో బీజేపీ నేతలు పీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.3 /21.4

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

ఏకగ్రీవం కాదు ఏకపక్షం

- సీఎం కేసీఆర్‌కు మద్దతుగా పల్లెల్లో తీర్మానాలు
- అవి బీఆర్ఎస్ వాళ్లవేనంటున్న ప్రత్యర్థి పార్టీల నేతలు
- ఆ ఊళ్లల్లో తమకూ క్యాడర్ ఉందంటూ ప్రకటనలు
- వివాదాస్పదమవుతున్న తీర్మానాలు

కామారెడ్డి నియోజకవర్గంనుంచి సీఎం కేసీఆర్ పోటీ చేయనున్న నేపథ్యంలో తమ బలాన్ని చూపేందుకు బీఆర్ఎస్ నేతలు పల్లెల్లో తీర్మానాలు చేస్తున్నారు. ఊళ్లకు ఊళ్లు తమ అధినేతకు అండగా నిలుస్తున్నాయని, అందుకే ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నాయని చెప్పుకునేందుకు యత్నిస్తున్నారు. అయితే అవి ఏకగ్రీవాలు కావని.. ఏకపక్షంగా బీఆర్ఎస్ నాయకులు చేస్తున్నవని ప్రత్యర్థి పార్టీలు ఆరోపిస్తున్నాయి. దీంతో ఏకగ్రీవ తీర్మానాలు వివాదాస్పదమవుతున్నాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే గ్రామాల్లో రాజకీయాలు వేడెక్కాయి.



సీఎం కేసీఆర్‌కు మద్దతుగా తీర్మానం చేసేందుకు మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేటలో సమావేశమైన పది గ్రామాల బీఆర్ఎస్ నేతలు(ఫైల్)

సాక్షి, కామారెడ్డి: ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చే ఎన్నికల్లో కామారెడ్డి నుంచి పోటీ చేస్తారని ప్రకటించిన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతల్లో జోష్ పెరిగింది. పార్టీ అధినేతే అభ్యర్థి కావడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా కార్యక్రమాలు చేపడుతున్నాయి. పల్లెలన్నీ కేసీఆర్ వెంట నిలుస్తున్నాయంటూ హడావిడి చేస్తున్నారు. జనాన్ని సమీకరించి కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తామంటూ ర్యాలీలు తీస్తున్నారు. ఆయా పంచాయతీలు తీర్మానాలూ చేస్తున్నాయి. మాచారెడ్డి, పాల్వంచ, రామారెడ్డి మండలాల్లోని పలు గ్రామాల్లో ఇటీవల కేసీఆర్‌కు మద్దతుగా తీర్మానాలు చేశారు. ర్యాలీలు తీశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ నేతలు స్పందించారు. ఆ గ్రామాలన్నింటా తమకు బలమైన క్యాడర్ ఉందని పేర్కొంటూ పోటీగా ర్యాలీలు నిర్వహించారు.

సామాజిక మాధ్యమాలలో..

ఊళ్లకు ఊళ్లే అధికార పార్టీకి అనుకూలంగా తీర్మానాలు చేస్తున్నాయని బీఆర్ఎస్ నేతలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకుంటున్నారు. దీనికి ప్రతిగా కాంగ్రెస్, బీజేపీ నేతలు ఆయా గ్రామాలకు చెందిన తమ క్యాడర్‌తో అవి ఉత్తుత్తి తీర్మానాలని ఆరోపిస్తూ వీడియోలు వైరల్ చేస్తున్నారు. దీంతో సామాజిక మాధ్యమాల్లో పోటాపోటీగా ప్రచారాలు నడుస్తున్నాయి. అన్ని పార్టీలకు ప్రతి గ్రామంలో క్యాడర్ ఉంటుందని, కానీ అధికార పార్టీ నేతలు ఊళ్లకు ఊళ్లే తీర్మానాలు చేస్తున్నాయంటూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ నేతలు ఏ ఊరిలో అనుకూల తీర్మానాల ప్రకటనలు చేశారో.. ఆ గ్రామాలకు చెందిన ఇతర పార్టీల నేతలు తీర్మానాలతో తమకు సంబంధం లేదంటూ ఖండిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా స్వేచ్ఛగా ఓటేసే హక్కు ఉంటుందని, దానిని హరించే హక్కు అధికార పార్టీకి లేదని ప్రతిపక్షాల నేతలు పేర్కొంటున్నారు. ఎన్నికల్లో పోటీచేయడం, ఓటు వేయడం విషయంలో బలవంతం తగదంటున్నారు. మెజారిటీ గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికార పార్టీలోనే ఉన్నారు. దీంతో పంచాయతీ మొత్తం ఏకగ్రీవంగా కేసీఆర్‌కు మద్దతు తెలుపుతూ తీర్మానాలు రాసుకుని పార్టీ నేతలకు ఇస్తున్నారు. అయితే పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసుకుంటే సరిపోతుందా, ప్రజల మద్దతు అవసరం లేదా అని ప్రతిపక్షాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

పోటాపోటీ కార్యక్రమాలు...

ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిన రాజకీయ పార్టీలు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. నియోజకవర్గంలో నిత్యం ఏదో ఒకచోట అధికార, ప్రతిపక్షాల కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అప్పుడే ఎన్నికలు వచ్చాయన్న వాతావరణం కనిపిస్తోంది. ఎన్నికలకు ఇంకా మూడు నెలల సమయం ఉన్నా తమ శ్రేణులు చేజారకుండా పార్టీల నేతలు కార్యక్రమాలతో దూకుడుగా వెళ్తున్నాయి.

ఆరేపల్లి గ్రామస్తుల ఆగ్రహం

మాచారెడ్డి: కామారెడ్డినుంచి పోటీ చేయనున్న సీఎం కేసీఆర్‌కు మద్దతుగా చేసిన తీర్మానం ఏకపక్షమని పాల్వంచ మండలం ఆరేపల్లి గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయమై వారు బుధవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామస్తులతో సంబంధం లేకుండానే బీఆర్ఎస్ నాయకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తీర్మానం చేసి ఏకగ్రీవ తీర్మానమని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నచ్చినవారికి ఓటు వేసే హక్కు ఉందన్నారు. కార్యక్రమంలో ఆరేపల్లి గ్రామస్తులతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గణేష్ నాయక్, నాయకులు సదార్ నాయక్, నాసీలాల్, రవిగౌడ్, మాన్‌సింగ్, శ్యాం సుందర్ రెడ్డి, రాజు, సుబ్బు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

6 నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా ఆరో తేదీనుంచి బియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల అధికారులు తెలిపారు. ఆహార భద్రత కార్డులపై ఒక్కో యూనిట్‌కు 6 కిలోల చొప్పున ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. అంత్యోదయ కార్డుదారులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులపై 10 కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు.

'రాఖీ కట్నంగా రెగ్యులరైజ్ చేయించండి'



కామారెడ్డి టౌన్: రాఖీ కట్నంగా తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయించాలని కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు కోరారు. వారు చేపట్టిన సమ్మె బుధవారానికి 16 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌కు ఏఎన్‌ఎంలు రాఖీలు కట్టారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ప్రభుత్వం స్పందించి పరీక్షను రద్దు చేసి తమను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, కార్యదర్శి రాజశేఖర్, నాయకులు దశరథ్, ఏఎన్‌ఎంలు మంజుల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెయూ డిగ్రీ పరీక్షల ఫలితాల విడుదల

- 40.53 శాతం ఉత్తీర్ణత
- బాలికలదే పైచేయి



తెయూ(డిచ్‌పల్లి) : తెయూ డిగ్రీ (ఫైనలియర్) తుది సెమిస్టర్ పరీక్షా ఫలితాలను కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తో కలిసి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి బుధవారం సాయంత్రం విడుదల చేశారు. డిగ్రీ పరీక్షలకు మొత్తం 9,026 మంది హాజరయ్యారని, 3,658 మంది విద్యార్థులు (40.53 శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇందులో బాలికలు 51.80 శాతం, బాలురు 24.16 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పీజీ ప్రవేశాల కౌన్సిలింగ్ ప్రక్రియ దృష్ట్యా డిగ్రీ పరీక్ష ఫలితాలను త్వరగా విడుదల చేశామన్నారు. అడిషనల్ కంట్రోలర్లు శాంతాబాయి, నందిని, ఆడిట్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, పీఆర్‌వో పున్నయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. www.telanganauniversity.ac.in ఫలితాలున్నాయని తెలిపారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

సుభాష్‌నగర్ : ఈడబ్ల్యూఎఫ్ రుణం కావాల్సిన నాన్ గెజిటెడ్, నాలుగో తరగతి ఉద్యోగులు తమ దరఖాస్తులను డ్రాయింగ్ ఆఫీసర్ల ద్వారా జిల్లా ట్రెజరీ కార్యాలయానికి పంపించాలని జిల్లా ట్రెజరీ కార్యాలయ ఉప సంచాలకులు కోటేశ్వర రావు బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. సంబంధిత ట్రెజరీ, సబ్ ట్రెజరీ కార్యాలయాల నుంచి దరఖాస్తు ఫారాలు పొందవచ్చన్నారు. సెప్టెంబర్ 20వ తేదీలోపు దరఖాస్తులను సమర్పించాలన్నారు.

అంగన్‌వాడీల సమ్మెనోటీసు



ఖలీల్‌వాడి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే సెప్టెంబర్ 11 నుంచి సమ్మెకు దిగుతామని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీకి సమ్మె నోటీసులను అందజేశారు. తెలంగాణ అంగనాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి స్వర్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు 40 ఏళ్లుగా పనిచేస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. కనీస వేతనం, పెన్షన్, పీఎఫ్ ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలు ఏవీ రాష్ట్ర ప్రభుత్వం కల్పించలేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు.

బిల్డర్ వద్ద పనిచేశా

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



బాల్కొండ: తాను 1990లలో నెలకు రూ.800లకు ఓ బిల్డర్ వద్ద పనిచేశానని ఆర్అండ్‌బీ శాఖమంత్రి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బాల్కొండలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల్పూర్‌లో తమ కుటుంబానికి 100 ఎకరాల ఆస్తి ఉండేదని, రాజకీయాలు, కుటుంబ బాధ్యతలతో మొత్తం పోయిందని పేర్కొన్నారు. దీంతో బిల్డర్ వద్ద పనిచేశానన్నారు. తర్వాత కష్టపడి బిల్డర్‌గా ఎదిగి, మళ్లీ ఆస్తులను సంపాదించుకున్నానన్నారు. ఎమ్మెల్యే అవుతానని కలలో కూడా అనుకోలేదని, ప్రజలు దీవించడంతోనే ఈ స్థాయికి వచ్చానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక ఒకడు కాంక్రీట్ క్రషర్‌కు అడ్డుతగిలాడు, మరొకడు కమీషన్ తీసుకుంటున్నానంటూ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాడని పరోక్షంగా బీజేపీ నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు సునీల్‌రెడ్డిల గురించి ప్రస్తావించారు. తనను రెచ్చగొట్టడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

'మండల ఏర్పాటుపై అభ్యంతరాలుంటే తెలపాలి'

కామారెడ్డి క్రైం: మహమ్మద్‌నగర్ మండలం ఏర్పాటుకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు, సూచనలు తెలపాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నిజాంసాగర్ మండలం నుంచి 18 గ్రామాలతో మహమ్మద్‌నగర్ మండలాన్ని ఏర్పాటు చేయడానికి ఈనెల 28న ప్రాథమిక ప్రకటన జారీ చేశామని పేర్కొన్నారు. మహమ్మద్‌నగర్, తెల్గాపూర్, శనివార్‌పేట్, సింగితం, వెంగళంపల్లి, మగ్దుంపూర్, గాలీపూర్, కోమలంచ, తుంకిపల్లి, తుర్కపల్లి, షేర్‌ఖాన్‌పల్లి, నర్వ, బూర్గుల్, హసన్‌పల్లి, నర్సాపూర్, రాఘవపల్లి, కోనంపల్లి, రంగాపూర్ గ్రామాలతో కొత్త మండలం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనిపై ఏవైనా అభ్యంతరాలుంటే పక్షం రోజుల్లోగా లిఖిత పూర్వకంగా తెలపాలని సూచించారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి



ఉపకరణాలను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ శోభ, కలెక్టర్ పాటిల్

- జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ
- పలువురికి ఉపకరణాల పంపిణీ

కామారెడ్డి క్రైం: అంగవైకల్యంతో పుట్టిన పిల్లలలో ఆ భావన రాకుండా అందరు పిల్లల మాదిరిగా వారిని ప్రోత్సహించాలని జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ సూచించారు. బుధవారం కామారెడ్డిలోని బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగవైకల్యంతో పిల్లలు పుట్టినా బాధపడకుండా అందరు పిల్లలతో సమానంగా పెంచుతున్న మాతృమూర్తులకు ధన్యవాదాలు తెలిపారు. అంగవైకల్యం గల పిల్లలలో ఆత్మ విశ్వాసం, ధైర్యం, ఏదైనా సాధించాలనే తపన మెండుగా ఉంటాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు వారిని వెన్నుతట్టి ప్రోత్సహించాలని సూచించారు. జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ జిల్లాలోని వికలాంగులను గుర్తించి వారికి అవసరమైన ఉపకరణాలు అందజేయడానికి ఎంతగానో కృషి చేశారన్నారు. జైపూర్‌కు చెందిన అలింకో సంస్థ సౌజన్యంతో బుధవారం 329 మంది దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, బ్రెయిలీ కిట్స్, ఇతర పరికరాలు, 117 మంది మానసిక దివ్యాంగులకు ఎంఎస్ఐఈడీ కిట్‌లు అందించారు. కార్యక్రమంలో దివ్యాంగులు ఆలపించిన పాటలు, చేసిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి, డీఈవో రాజు, సమగ్ర శిక్ష అభియాన్ కోఆర్డినేటర్ శ్రీపతి, కౌన్సిలర్లు, ఐఆర్పీలు, వికలాంగుల సంఘం ప్రతినిధి పోచవ్వ తదితరులు పాల్గొన్నారు.

అనుబంధానికి రక్ష!

- నేడు రాఖీపౌర్ణమి





కామారెడ్డిలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

సాక్షి, కామారెడ్డి: అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్. శ్రావణ పౌర్ణమి రోజున ఈ పర్వదినాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఎక్కడెక్కడో ఉన్న అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు పండుగ పూట కలుసుకుంటుంటారు. చిన్నప్పటి నుంచి ఒకరినొకరు తోడుగా ఉన్న వారంతా రక్షాబంధన్ రోజున రాఖీలు కట్టుకుని మురిసిపోతారు. జీవన పయనంలో వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడి, రావడానికి వీలు కుదరని వారు పోస్టు ద్వారా, కొరియర్ ద్వారా రాఖీలు పంపిస్తుంటారు. బతుకుదెరువు కోసం గల్ఫ్ తదితర దేశాలకు వెళ్లిన వారికి సైతం రాఖీలు పోస్ట్/కొరియర్ ద్వారా పంపిస్తుంటారు. పండుగ నేపథ్యంలో ఊరూవాడ సందడి నెలకొంది. తోడబుట్టినవారికి రాఖీలు కట్టడానికి అక్కాచెల్లెళ్లు రావడంతో ఇళ్లన్నీ కళకళలాడుతున్నాయి.

మార్కెట్‌లో సందడి..

రాఖీ పౌర్ణమికి వారం పదిరోజుల ముందు నుంచే సందడి కనిపిస్తుంది. రాఖీలు విక్రయించే దుకాణాలు, స్వీట్ షాపుల వద్ద రద్దీ ఉంటోంది. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాలతో పాటు వ్యాపారాలు సాగే అన్నిచోట్లా సందడి నెలకొంది. రకరకాల రాఖీలు అమ్ముతున్నారు.

అనిర్వచనీయం..



అక్కాతమ్ముళ్ల మధ్య ఉండే బంధం అనిర్వచనీయమైనది. మా తమ్ముడికి చిన్నప్పటి నుంచి రాఖీ కడుతున్నాను. పండుగ రోజు కచ్చితంగా పుట్టింటికి వెళ్లి రాఖీ కట్టాల్సిందే. మా కజిన్స్‌కి కూడా రెగ్యులర్‌గా రాఖీ కడతాను.

– చిలువేరి శ్రీదేవి, కామారెడ్డి

ఆనందంగా ఉంటుంది



రాఖీ పౌర్ణమి రోజున తమ్ముడికి రాఖీ కడితే చాలా సంతోషంగా ఉంటుంది. ఏటా రాఖీ పౌర్ణమి నాడు తమ్ముడి వద్దకు వెళ్లి రాఖీ కడతాను. ఈ పండుగ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తూ ఉంటాను.

– రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయురాలు, ఎల్లారెడ్డి

మూడు దశాబ్దాలుగా..



అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. ఆ రోజున తమ్ముడు నా దగ్గరికి రావడమో.. లేదా నేనే తమ్ముడి వద్దకు వెళ్లడమో చేస్తాం. 30 ఏళ్లుగా తమ్ముడికి రాఖీ కడుతున్నా.

– ఓర సుష్మ, ఎల్లారెడ్డి

'రాజకీయ పార్టీలదే కీలకపాత్ర'



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఎలాంటి అపోహలకు తావు లేకుండా తప్పులులేని, స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమైందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26, 27 తేదీలలో ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణలు, తొలగింపులపై నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 3,358 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిని పరిశీలిస్తున్నామన్నారు. తిరిగి సెప్టెంబర్ 2, 3 తేదీలలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నామన్నారు. బూత్ స్థాయి అధికారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటరు ముసాయిదా జాబితాతో పాటు, ఫారం 6, 7, 8 లతో అందుబాటులో ఉంటారని తెలిపారు. రాజకీయ పార్టీలు ప్రతి బూత్‌లో తమ ఏజెంట్‌ను నియమించుకోవాలని సూచించారు. ఓటరు జాబితా నుంచి ప్రముఖులు, ప్రజాప్రతినిధుల పేర్లు తప్పిపోకుండా చూడాలన్నారు. డూప్లికేట్, షిఫ్టింగ్, చనిపోయిన ఓటరు వివరాలు ఉంటే తెలపాలన్నారు. సెప్టెంబర్ 19 వరకు ఆక్షేపణలు, అభ్యంతరాలను స్వీకరించి 28న పరిష్కరిస్తామని, అక్టోబర్ 4 న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండేవారు ఓటరుగా నమోదయ్యేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు మదన్ లాల్ జాదవ్, అనిల్ కుమార్, మీర్జా హఫీజ్ బేగ్, అవధూత నరేందర్, ఖాసీం అలీ, స్వామి, బాలరాజు, ఎన్నికల విభాగం అధికారి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటస్థలానికి 2.20 ఎకరాలు విరాళం

మాచారెడ్డి: ఉమ్మడి ఎల్లంపేటవాసులు క్రికెట్ ఆడుకోవడం కోసం దాదాపు రూ. 40 లక్షల విలువైన పట్టా భూమిని మాచారెడ్డి ఎంపీపీ నర్సింగరావు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎంపీపీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాంరెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు.



ఎల్లంపేటలో భూమిని విరాళమిచ్చిన నర్సింగరావును అభినందిస్తున్న గ్రామస్తులు

క్లుప్తంగా

డిచ్‌పల్లిలో ఆర్‌ఎంపీపై ఫిర్యాదు

డిచ్‌పల్లి: తనను ఆర్‌ఎంపీ డాక్టర్ కట్టా అశోక్ మోసం చేశాడంటూ ఓ మహిళ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ఆర్‌ఎంపీ అశోక్ ఐదేళ్లుగా తనతో సహజీవనం చేసి పెళ్లి చేసుకుని ఇప్పుడు వదిలించుకోవాలని చూస్తున్నాడని బాధితురాలు పద్మ ఆరోపించారు. ఆలిండియా హ్యూమన్‌రైట్స్ ఆధ్వర్యంలో అశోక్ ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు డాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కోర్టు అనుమతి తీసుకుని కేసు నమోదు చేస్తామని ఎస్సై మహేశ్ తెలిపారు.

అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రి వేముల



భీమ్‌గల్: భీమ్‌గల్ మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీపీ ప్రకాశ్‌గౌడ్ అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన అంత్యక్రియలకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకారుడిని కోల్పోవడం బాధగా ఉందని మంత్రి అన్నారు.

పేదల సొంతింటి కల నెరవేరేనా..?

- పల్లెల్లో కనిపించని 'డబుల్' ఇళ్లు
- పట్టణాలు, మండలాలకే పరిమితం
- గ్రామాల్లో స్థల కేటాయింపు ఉన్నా ఆచరణకు నోచుకోని వైనం



మోర్తాడ్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు



పాలెంలో ఇండ్ల స్థలాల కోసం సేకరించిన భూమి

మోర్తాడ్(బాల్కొండ): నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డబుల్‌బెడ్ రూం ఇండ్ల పథకం గ్రామ పేదలకు కలగానే మారుతోంది. ఇళ్లు కట్టుకోలేని పేదలకు ప్రభుత్వమే డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తుందని పలుమార్లు సీఎం కేసీఆర్ వెల్లడించారు. కానీ ఆచరణలో మాత్రం పట్టణాలు, మండలాల్లో అమలవుతున్నా గ్రామ ప్రజలకు మాత్రం అందడం లేదు. జిల్లాలో 530 జీపీలు ఉండగా కేవలం 29 చోట్లనే డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించారు. మిగిలిన పంచాయతీల్లో ఒక్క ఇంటికి కూడా పునాది వేయలేదు. పల్లెల్లోనూ ఎంతో మంది ఇండ్లు లేని నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలు ఉన్నారు. వీరికి సొంతగా జాగా లేకపోవడమే కాకుండా కొనుగోలు చేయడానికి ఆర్థిక శక్తి లేకపోయింది. ఉమ్మడి రాష్ట్రంలో నాటి వైఎస్సార్ ప్రభుత్వం ప్రతి ఊరిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడానికి సుమారు 8 ఎకరాల వరకు స్థలాలను సేకరించారు. ఇండ్ల స్థలాలను లబ్ధిదారులకు కేటాయించి ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవడానికి చర్యలు తీసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించకుండా ఖాళీగా ఉన్న స్థలాల్లోనే కొన్ని చోట్ల డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించారు. మోర్తాడ్‌లో ఇందిరమ్మ ఇండ్ల కోసం సేకరించిన స్థలంలో 220 ఇండ్లను నిర్మించారు. వీటి నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేయగా రూ.13.50 కోట్లను ఇండ్ల నిర్మాణానికి, రూ.1.50 కోట్లను మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేశారు. ఈ లెక్కలను పరిశీలిస్తే ఒక్కో డబుల్ బెడ్‌రూం ఇంటికి రూ.6 లక్షల వరకు ఖర్చు చేసినట్లు స్పష్టమవుతోంది.

'గృహలక్ష్మి'తోనే సరిపెడతారా...?

మండల కేంద్రాలను మినహాయించి ఇతర పంచాయతీల పరిధిలో డబుల్ బెడ్‌రూ ఇండ్లను నిర్మించడానికి చర్యలు తీసుకోకపోవడాన్ని పరిశీలిస్తే గృహలక్ష్మి పథకంతోనే సరిపెడతారా అనే సందేహం వ్యక్తమవుతోంది. గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల సాయాన్ని అందించనున్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లకు ఒక్కో ఇంటికి రూ.6లక్షల వరకు ఖర్చు చేసిన ప్రభుత్వం సొంతంగా ఇంటిని నిర్మించుకునేవారికి రూ.3లక్షలే సాయం అందించనుంది.

అంటే ఇంటిని నిర్మించుకునేవారిపై ఆర్థిక భారం ఎక్కువయ్యే అవకాశం ఉందని వెల్లడవుతోంది. గృహలక్ష్మి పథకం కింద అందించే సాయం విలువను పెంచితే డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రభుత్వం నిర్మించి ఇవ్వకపోయినా ఇబ్బంది ఉండదనే వాదన బలంగా వినిపిస్తోంది.

పల్లెల్లోనూ 'డబుల్' ఇళ్లను నిర్మించాలి



మండల కేంద్రాలు, పట్టణాల్లోని ప్రజలను ఒకలా పల్లెల్లోని వారిని మరోలా చూడడ ఎంతవరకు సమంజసం. డబుల్ బెడ్‌రూం ఇండ్లను పల్లెల్లోను నిర్మించాలి. అర్హులైన వారిని గుర్తించి అంతే మొత్తంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మిస్తే బాగుంటుంది. పల్లె ప్రజలు అంటే తెలంగాణ ప్రభుత్వానికి చులకనగా ఉంది.

– ఆడెపు సవిత, ఎంపీటీసీ , తాళ్లరాంపూర్

పల్లె ప్రజలూ మనుషులే..



పల్లెల్లోని ప్రజలను కూడా మనుషులుగా గుర్తించాలి. మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించి పల్లెలను ఎందుకు మరిచిపోయారు. పల్లెల్లో ఉన్నవారు ఓట్లు వేయరా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పల్లెల్లోనూ డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించాలి.

– సోమ పెద్ద రాజారెడ్డి, సర్పంచ్, గుమ్మిర్యాల్

ఘనంగా రక్షా బంధన్ వేడుకలు



రాఖీ కడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార



ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలలో బాలురకు రాఖీలు కడుతున్న బాలికలు

సాక్షి నెట్‌వర్క్:జిల్లాలో బుధవారం పలు చోట్ల రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. పండుగ సందర్భంగా రాఖీల దుకాణాలు కొత్తగా వెలిశాయి. మిఠాయి దుకాణాలు కళకళలాడాయి. నువ్వు నాకు రక్ష, నేను నీకు రక్ష, మనమిద్దరం దేశానికి రక్ష అంటూ పండుగ సందర్భంగా కళాశాల, పోలీసు స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాల్లో రాఖీలను పంచిపెట్టారు. పాఠశాలల్లో విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. అలాగే పలువురు జిల్లా ప్రముఖులు రాఖీలు కట్టి పండుగ విశిష్టత గురించి తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని సూచించారు.



బీబీపేట పోలీసుస్టేషన్‌లో..



రాజంపేట శిశుమందిర్ పాఠశాలలో..



జుక్కల్ పాఠశాలలో..



శెట్పల్లిసంగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో..



బోర్లంలో..

ఎమ్మెల్యేను నిలదీసేందుకు యువత సన్నద్ధం

- 4 గంటలు ఆలస్యంగా ఎమ్మెల్యే ప్రజాఆశీర్వాద యాత్ర



మాక్లూర్: మండలంలోని గుంజిలి గ్రామంలో బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ప్రజా ఆశీర్వాద యాత్ర 11 గంటలకు ప్రారంభమైంది. గ్రామంలో ఎమ్మెల్యే ప్రజాఆశీర్వాద యాత్రను తెలుసుకున్న స్థానిక యువకులు 2018లో ఇచ్చిన హామీలపై ఎమ్మెల్యేను నిలదీద్దామని 11 ప్రశ్నలు సంధిస్తూ వాట్సాఫ్, పేస్‌బుక్‌లలో వైరల్ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్థానిక పరిస్థితులను తెలుసుకుని అన్ని సద్దుమనిగిన తరువాత 4 గంటలు ఆలస్యంతో గ్రామానికి 11 గంటలకు చేరుకున్నారు. గ్రామస్తులు కొత్తపల్లి ఆర్‌అండ్ రోడ్ నుంచి బైక్ ర్యాలీతో ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ముందుగా రామాలయం, ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని కోరారు. మహిళలతో రాఖీ కట్టించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాస్త ప్రభాకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బడుగు సత్యం, సొసైటీ చైర్‌పర్సన్ గోపు లక్ష్మి, ఆకుల రజినీశ్, సర్పంచ్ గుండారం శేఖర్, గోపు రంజిత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అశోక్‌కు నగదు బహుమతి అందజేత



వేల్పూర్: కామారెడ్డి ఆర్టీఏ పరిధిలో హోంగార్డుగా పనిచేస్తున్న వేల్పూర్ వాసి గుగ్గిలం అశోక్ జాతీయ స్థాయి మారథాన్‌కు ఎంపికయ్యాడు. జాతీయ స్పోర్ట్స్ డేను పురస్కరించుకొని మంగళవారం రాత్రి కలెక్టర్ జితేశ్ పాటిల్ అశోక్‌కు రూ.20 వేల నగదు బహుమతి అందించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మెదక్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి 400, 800 మీటర్ల మారథాన్‌లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. కార్యక్రమంలో కామారెడ్డి ఆర్టీఏ వాణి పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్

ఖలీల్‌వాడి: నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాములబస్తీలో ఏసీపీ ఆధ్వర్యంలో నగర సీఐ నరహరి, ఎస్సైలు ప్రవీణ్, సంజీవ్, అశోక్, యాదగిరి, అప్పారావు, సిబ్బందితో కలిసి బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు.

ఆర్టీసీ కార్గోలో దోపిడీ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ కార్గోలో దోపిడీకి గురి చేస్తున్నారని పలువురు ఆరోపించారు. బుధవారం పార్సిల్ తీసుకున్న ఇద్దరు వ్యక్తులు ఆందోళన చేశారు. తమకు వచ్చిన పార్సిల్ డిపోలో తీసుకుంటే అదనంగా రూ. 10 నుంచి రూ. 20 వరకు బలవంతంగా వసూళ్లు చేస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిపోలో ఫ్రీగా డెలివరీ చేయా ల్సి ఉండగా బలవంతంగా డబ్బులు వసూళ్లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిసిప్ట్ ఇవ్వాలని ప్రశ్నిస్తే ఆర్టీసి సిబ్బంది దూషించారని వాపోయారు. అధికారులు స్పందించాలని కోరారు.

క్రైం కార్నర్

చెరువుల్లో పడి ఇద్దరి మృతి



దత్తురాంరెడ్డి (ఫైల్)

పిట్లం(జుక్కల్): మండలంలోని కారేగాం కిందికుంట చెరువులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు ఏఎస్సై లింబాద్రి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దత్తురాంరెడ్డి (43) మంగళవారం చెరువులో నుంచి గేదేలను బయటకు పంపే క్రమంలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఎల్లయ్య చెరువులో..

పిట్లం(జుక్కల్): చిన్నకొడప్‌గల్ గ్రామంలోని ఎల్లయ్య చెరువులో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఏఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అనిత (34) మంగళవారం రాత్రి తన భర్త బాగయ్యతో గొడవపడి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని ఒకరు..

ఖలీల్‌వాడి: జాన్కంపేట్, నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని కోజాకాలనీలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై తావుజీ తెలిపారు. మృతుడి వయస్సు 30 ఏండ్ల వరకు ఉంటుందని అన్నారు. వివరాలు తెలిసిన వారు 8712568440 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాము కాటుతో రైతు..

ఎల్లారెడ్డి: పాము కాటుతో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన మాశిడి కిషన్ (50) పొలంలో పనులు చేస్తుండగా పాము కాటువేసిందన్నారు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె ..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల శివారులో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. తాడ్వాయికి చెందిన పుల్లూరి నర్సయ్య రోజు మాదిరిగానే తన పాడి గేదెను గ్రామ శివారులోని చెరువు కట్టపై మేతకు తీసుకెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ఆర్థికసాయం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.

మోటరు పంపు చోరీ

ఇందల్వాయి: మండలంలోని పల్లె ప్రకృతి వనంలో ఉన్న బోరుబావి నుంచి మోటరు పంపును గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చోరీ చేసినట్లు ఎంపీటీసీ చింతల దాసు బుధవారం తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆలయాల్లో చోరీకి యత్నం

రుద్రూర్: మండల కేంద్రంలోని రెండు ఆలయాల్లో దుండగులు మంగళవారం రాత్రి చోరికి యత్నించారు. చౌడేశ్వరీ దేవి ఆలయం తాళాన్ని పగులగొట్టిన దుండగులు గర్భగుడి హుండీలో ఉన్న నగదును దొంగిలించారు. అంతేకాకుండా పాండురంగ వితలేశ్వరస్వామి ఆలయంలో హుండీని పగులగొట్టేందుకు ప్రయత్నం చేశారు. కానీ హుండీ తెరుచుకోలేదు. ఉదయం పూజలు చేయడానికి వచ్చిన విషయాన్ని గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు.

హత్యకేసులో అత్తామామ అరెస్ట్



ఖలీల్‌వాడి: నగరంలోని చంద్రశేఖర్ కాలనీలో ఈ నెల 28న కృష్ణను హత్య చేసిన ఘటనలో అత్తామామలతో పాటు అతని భార్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సౌత్ సీఐ వెంకటనారయణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రశేఖర్ కాలనీకి చెందిన గాదం గంగ, దానమైన కృష్ణ ఆరేండ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్ని రోజుల నుంచి గంగను వేధిస్తుండడతో సహనం కోల్పోయిన భార్య, అత్తామామలు సత్తెమ్మ, గంగామురళీ గొడ్డలితో కలిసి హత్య చేశారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలి, కారంపొడిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆకలిబాధ తట్టుకోలేక ఆత్మహత్య

రెంజల్(బోధన్): కొడుకులు కాదు పొమ్మనడంతో ఆకలిబాధ తట్టుకోలేక 57 ఏండ్ల వృద్ధుడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఓ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నాలుగేండ్ల క్రితం భార్య మృతిచెందడంతో గ్రామంలోని ఇద్దరు కుమారుల వద్ద జీవనం కొనసాగిస్తున్నాడు. కొంత కాలంగా కొడుకులు, కోడళ్లు పట్టించుకోకపోవడంతో ఆకలితో అలమటించాడు. చివరకు ఆకలిబాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పురుగుల మందు తాగి నునావత్ అశోక్(26) మృతి చెందినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. మండల కేంద్రంలోని డంపింగ్ యార్డ్ సమీపంలో ఉన్న గుంతలో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు బిచ్కుంద మండలం సీతారాంపల్లి తండాకు చెందిన నూనావత్ అశోక్‌గా గుర్తించారు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన అశోక్ తిరిగి రాలేదన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

యువకుడి అదృశ్యం



రాజశేఖర్ (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ఒడ్డెరకాలనీకి చెందిన యువకుడు బోదాసు రాజశేఖర్ అదృశ్యమైనట్లు ఎస్సై రాము బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని మహేశ్ దగ్గర రాజశేఖర్ గేదెల కాపరిగా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొరం టిప్పర్ ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు



మాక్లూర్: మొరం టిప్పర్, బైక్ ఢీకొన్న ఘటన మండలంలోని గాంధీనగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఆయుస్సు, అతని తల్లి షాహిన్‌బేగం బైక్‌పై నిజామాబాద్ వైపు వెళ్తుండగా దాస్‌నగర్ నుంచి ఖాళీగా వస్తున్న మొరం టిప్పర్ బైక్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఆయుస్సు తలకు బలమైన గాయాలు కాగా తల్లి షాహీన్‌బేగానికి చేయి విరిగింది. స్థానికులు అంబులెన్సులో చికిత్స నిమితం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన విషయమై ఎస్సై సుధీర్‌రావును వివరణ కోరగా తమకు ఇంకా ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

అన్నివర్గాలను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్



దీక్షలో కూర్చున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని అన్నివర్గాలను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని, సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో తెలంగాణ సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షకు ధన్‌పాల్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దిలీప్, ప్రధానకార్యదర్శి రాజు, కోశాధికారి ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు అష్రఫ్ అలీ, నాయకులు సుక్క మధు, ఇల్లెందుల ప్రభాకర్, మాస్టర్ శంకర్, బంటు రాము, పవన్, ఆనంద్, గంగాధర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న బీజేపీ నేత ఏనుగు రవీందర్‌రెడ్డి

కామారెడ్డి రూరల్: తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి రాఖీ కడుతూ వినతి పత్రం అందజేశారు. అలాగే సమగ్ర శిక్ష మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి దీక్షలు చేపడుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులకు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి, పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నేత ఏనుగు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ... సమగ్ర శిక్షను విద్యాశాఖలో విలీనం చేసి 25 వేల మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగత భద్రత కల్పించి, మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని కోరారు. తెలంగాణ వస్తే కాంట్రాక్ట్ వ్యవస్థ తొలగించి ప్రతి ఒక్కరిని రెగ్యులరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ పేర్కొన్నారని ఇప్పుడు కామారెడ్డిలో పోటీ చేస్తున్నారని రాష్ట్రమంతా మీ వైపే చూస్తుందని మీరు తప్పకుండా క్రమబద్దీకరించే వరకు పోరాటం ఆపవద్దని లేదంటే తాము అధికారంలోకి వచ్చాక రెగ్యులరైజ్ చేస్తామన్నారు. జిల్లా జేఏసీ కన్వీనర్ సత్యనారాయణ, మహిళ అధ్యక్షురాలు వాసంతి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్య



సబిత్‌రెడ్డి (ఫైల్)

కామారెడ్డి క్రైం: ఆర్థిక సమస్యలు, భార్యతో విడాకులతో జీవితంపై విరక్తి చెందిన ఓ పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా ఉగ్రవాయి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన పుట్ట సబిత్‌రెడ్డి(29) ఉగ్రవాయి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో కొంతకాలంగా సతమతమవుతున్నాడు. కుటుంబ కలహాలతో అతడి భార్య విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో మానసికంగా కుంగిపోయిన సబిత్‌రెడ్డి బుధవారం తాను పనిచేసే పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనానికి వెళ్లి, చెట్టుకు ఉరి వేసుకుని మరణించాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు మృతదేహాన్ని గమనించి దేవునిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై రాజు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. ఆర్థిక సమస్యలతో సబిత్‌రెడ్డి కొద్ది రోజులుగా మానసిక ఒత్తిడికి గురవుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకోవడంతో ఒత్తిడికి లోనై ఆత్మహత్య చేసుకుని ఉంటాడని మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సూసైడ్ నోట్ రాసి...

తాను అందరికీ ఆదర్శంగా ఉండాలని అనుకునే వాడినని, చేసిన ఒక తప్పు కారణంగా అలా ఉండలేకపోయానని మృతుడు సబిత్‌రెడ్డి సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. సమస్యల కారణంగా వృత్తికి సైతం న్యాయం చేయలేకపోతున్నానని , కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, తాను చనిపోతున్నానని నోట్‌లో పేర్కొన్నాడు.

గ్రామంలో విషాదఛాయలు

దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్ గ్రామంలో జీపీ కార్యదర్శి పుట్ట సబిత్‌రెడ్డి బుధవారం ఆత్మహత్య చేసుకోవడంతో విషాదచాయలు అలుముకున్నా యి. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంర్ర మధుసూదన్‌రావు, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, సర్పంచ్ నరేశ్, ఉపసర్పంచ్ రాంరెడ్డి, మాజీ సర్పంచ్ మురళీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఒకరిపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని బోధన్‌రోడ్డు చౌరస్తా వద్ద ఉన్న వైన్స్ వద్ద మహారాష్ట్రకు చెందిన సంతోష్‌పై షేక్ సలీం బ్లేడ్‌తో దాడి చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. దీంతో తీవ్రగాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నగరంలోని ముస్తాహిద్‌పుర ప్రాంతానికి చెందిన షేక్ సలీం, సంతోష్‌కు మధ్య గొడవ జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పేకాటస్థావరంపై..

ఖలీల్‌వాడి: మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని ఆదర్శనగర్‌లో పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ సీఐ అజయ్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.16,820 నగ దు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరై నా పేకాట ఆడితే తమకు సమాచారం అందించాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్సై ప్రవీణ్ పేర్కొన్నారు.

బ్రహ్మపురి కాలనీలో ..

ఖలీల్‌వాడి: నగరంలోని బ్రహ్మపురి కాలనీలో పేకాట స్థావరంపై దాడి నిర్వహించినట్లు ఎస్సై అశోక్ బుధవారం తెలిపారు. దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.16 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.